నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 8 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

స్కందమాతా రూపంలో అమ్మవారు

బాసర, అక్టోబర్ 7 : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం బాసర సరస్వతీ అమ్మవారు స్కందమాతా రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. ఆలయంలో సుహాసిని పూజ, మంత్రపుష్పం, మూల నక్షత్రపూజలను అర్చకులు నిర్వహించారు. ఆరో రోజు భక్తులకు సరస్వతీ అమ్మవారు కాత్యాయని రూపంలో దర్శనం ఇవ్వనున్నారు.

స్కందమాతా రూపంలో అమ్మవారు

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బతుకమ్మ సంబరాలు

ఎదులాపురం, అక్టోబర్ 7 : ఆదిలాబాద్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా పోలీసులు సోమవారం బతుకమ్మ సంబరాల్లో కలెక్టర్ దంపతులు రాజర్షి షా, సెకండ్ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, ఎస్పీ గౌష్ ఆలం కుటుంబ సభ్యులు, జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రశాంత్, బాజీరావ్ పాటిల్ కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ దంపతులు, ఎస్పీ, మహిళలు

సమస్యలను పరిష్కరించండి

దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా

ప్రజావాణిలో దరఖాస్తులు తీసుకుంటున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ విన్నవించుకున్నారు. కలెక్టర్ రాజర్షి షా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అధికారులు పాల్గొన్నారు.

- ఆదిలాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ)

కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదు..

మా సొంతింటి కరెంటు కనెక్షన్ మీటరు కోసం డబ్బులు కట్టా. మేలో మీటరు మంజూరై కరెంటు ఆఫీసులో ఉంది. కనెక్షన్ ఇవ్వమని విద్యుత్ అధికారులను అడిగితే మీ ఇల్లు పోల్‌కు దూరంగా ఉందని అంటున్నారు. కొత్తగా కరెంటు స్తంభాలు వేయాలని చెబుతున్నారు. కూలీ పనులు చేసుకుంటూ బతికే మేము డబ్బులు ఎక్కడి నుంచి కడుతాం. గ్రామ పంచాయతీ అధికారులను అడిగితే స్పందించడం లేదు. విద్యుత్ అధికారులు, పంచాయతీ సిబ్బంది చుట్టూ ఐదు నెలల నుంచి తిరుగుతున్నా. స్పందన లేకపోవడంతో ప్రజావాణికి వచ్చి కలెక్టర్ సార్‌కు దరఖాస్తు అందజేశా.

- మమత, బట్టి సావర్గాం, మావల మండలం

దివ్యాంగుల పింఛన్ కోసం వచ్చిన..

నాకు ఏడాదిన్నర కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు తీసేశారు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే నాకు ప్రమాదంలో కాలు కోల్పోవడంతో ఏ పని చేసే అవకాశం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో గతేడాది డిసెంబరులో వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు ఇచ్చా. ఇప్పటి వరకు ఏమీ కాలేదు. పింఛన్ విషయంలో అధికారులను అడిగితే ఆన్‌లైన్ లేదని అంటున్నారు. ప్రజావాణిలో పింఛన్ కోసం దరఖాస్తు ఇవ్వడానికి ఇచ్చోడ నుంచి ఆటోలో వచ్చా.

- షేక్ అబ్బు, ఇచ్చోడ

మా గ్రామ రైతులకు రుణమాఫీ లేదు..

మా గ్రామంలో చాలా మంది రైతులం రూ.2 లక్షల లోపు బ్యాంకు రుణం తీసుకున్నం. తలమడుగు మండలంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రంలో తీసుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వల్ల మా బ్యాంకు అప్పు తీరిపోతుందని ఆశపడ్డాం. మా గ్రామంలో చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే ఆన్‌లైన్‌లో డాటా నాట్ ఫౌండ్ అని వస్తున్నదని అంటున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని అంటున్నారు. బ్యాంకు అధికారులేమో వివరాలు పంపినం.. మాకు ఏమీ తెలియదని సమాధానం చెబుతున్నారు. గిరిజన పేద రైతులమైన మేము బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించాం.

- పల్మి తండా రైతులు, తలమడుగు మండలం

మధ్యాహ్నం 12 గంటలు.. : మార్కెట్ యార్డు ఓపెన్ చేయకపోవడతో గేటు ఎదుట సోయాబిన్ తీసుకొచ్చిన వాహనం

మధ్యాహ్నం 1 గంటలు : గేటు తాళం తీస్తున్న సిబ్బంది

సోయా కొనుగోళ్లు ఏమాయే..

అలా ప్రారంభించారు.. ఇలా వదిలేశారు..

- ఒంటి గంట వరకు మార్కెట్ యార్డుకు తాళం
- వాహనంతో గేటు ఎదుట నిరీక్షించిన రైతు
- కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని కోరుతున్న అన్నదాతలు

సోమవారం మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నది. ఆదిలాబాద్ మార్కెట్ యార్డు గేటు తీయలేదు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కుంభఝరికి చెందిన రైతు దేవన్న తన 24 క్వింటాళ్ల సోయా పంటను విక్రయించడానికి వాహనంలో వచ్చాడు. మార్కెట్ యార్డు గేటుకు తాళం వేసి ఉండడంతో ఆయన గంటకు పైగా మార్కెట్ యార్డు ఎదుట వాహనం నిలిపి నిరీక్షించాడు. అక్కడ ఉన్న మార్కెట్ యార్డు సిబ్బందికి సోయాను విక్రయించడానికి తీసుకొచ్చానని చెప్పారు. అప్పుడు మెల్లిగా స్పందించిన సిబ్బంది మధ్యాహ్నం 1 గంటలకు తాళం తీశారు. దీంతో వాహనాన్ని లోపలికి తీసుకుపోయారు. ఈ విషయమై మార్కెట్ యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి మధూకర్‌ను వివరణ కోరగా.. తాను తాంసిలో సోయాబిన్ సెంటర్ ప్రారంభానికి వెళ్లానని తెలిపాడు. కొనుగోలు సిబ్బందిని గేటు మూసిన విషయం తెలియదన్నారు. కాగా.. శుక్రవారమే స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ప్రారంభించగా.. అప్పుడే మూసి ఉంచడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. కొనుగోళ్లను సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.

- ఆదిలాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ)

మధ్యాహ్నం 2 గంటలు : మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న సోయా కొనుగోలు కేంద్రం

జీతాలు మహాప్రభో..

ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టరేట్‌ల ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఎదులాపురం,అక్టోబర్ 7 : గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జు ఆశన్న డిమాండ్ చేశారు. సోమవారం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జు ఆశన్న మాట్లాడుతూ.. పండుగలు సమీపిస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి రాకముందుకు కాంగ్రెస్ పార్టీ కార్మికులను పర్మనెంట్ చేస్తామని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని మండిపడ్డారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు స్వామి, చిన్నన్న పాల్గొన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 7 : గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ.. వేతనాలు చెల్లించకపోవడంతో పండుగ పూట పస్తులు ఉండాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన దీక్షకు వారు మద్దతు పలికారు. వేతనాలు వెంటనే మంజూరు చేయకుంటే సమ్మె కొనసాగిస్తూ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు, నాయకులు

కస్తూర్బా తో స్థానిక బాలికలకు మేలు

గదుల కోసం భూమిపూజ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కస్తూర్బా అదనపు గదులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్, అక్టోబర్ 7 : కేసీఆర్ హయాంలోనే గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు ఏర్పాటయ్యాయని, వీటితో కోట్లాది మంది విద్యార్థులు ప్రయోజకులయ్యారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో రూ.35 కోట్లతో మంజూరైన కస్తూర్బా విద్యాలయం త్వరలో అందుబాటులోకి రానుందని తెలిపారు. దీనితో 26 పంచాయతీలు అనుబంధ గ్రామాల బాలికలకు మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం భీంపూర్‌లో రూ.2.30 కోట్లతో మంజూరైన కస్తూర్బా విద్యాలయ అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీంపూర్ గ్రామస్తులు ప్రతి కార్యాలయానికి అవసరమైనంత భూమిని విరాళంగా ఇస్తుండడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నలంద ప్రియ, డీఈ శంకర్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, డీటీ హరిదాస్, ఏఈ సుమంత్, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, నాయకులు జి.నరేందర్‌యాదవ్, లింబాజీ, ఎం.కల్చాప్‌యాదవ్, సంజీవ్‌రెడ్డి, సంతోష్, రవీందర్, పురుషోత్తం, రవూఫ్, బాదర్, అనిల్, అఫ్రోజ్, నితిన్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేలా కార్యక్రమాలు

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 7 : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ అవగాహన ర్యాలీ నిర్వహించామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం సాయంత్రం ర్యాలీ జిల్లాకు చేరుకోగా.. సోమవారం స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు క్రీడాజ్యోతి చేపట్టారు. దీనికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ముందుగా ర్యాలీకి జెండా ఊపి క్రీడాజ్యోతితో పరుగులు తీశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ముగింపు తరువాత గ్రామ, మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 21 నుంచి పోటీలు నిర్వహించేలా ప్రభుత్వ ఆదేశాలున్నాయని, దానికి అనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి క్రీడలపై శ్రద్ధ కనబరుస్తూ జిల్లా కేంద్రంలో స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గౌష్ ఆలం, డీవైఎస్ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

క్రీడాజ్యోతి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిని తనిఖీ చేసిన కమిషనర్

నిర్మల్ వైద్య కళాశాల దవాఖానలో రోగిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 7 : రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. నిర్మల్ వైద్య కళాశాల దవాఖానను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ వార్డు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ వార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నామన్నారు. రోగులకు అందుతున్న సేవలు, మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో పరిశీలన చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వంటి పలు అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్, డీసీహెచ్ఎస్ సురేశ్, డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ సందర్శన

ఎదులాపురం, అక్టోబర్ 7 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ దవాఖానతోపాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సోమవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రిలోని సౌకర్యాలు, ఇతరత్రా అంశాలను అడిగి తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు, సిబ్బందిని భర్తీ చేయడానికి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. డ్రగ్ స్టోర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడంతోపాటు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆర్ఎంవో తొడసం చందు, వైద్యులు తిప్పే స్వామి పాల్గొన్నారు.

మందులు, సౌకర్యాల పరిశీలన

ఉట్నూర్, అక్టోబర్ 7 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ కమిషన్ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని వార్డులు, మందులు, సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ ఉన్నారు.

నాలుగు డయాలసిస్ బెడ్లు ప్రారంభం

ఎదులాపురం, అక్టోబర్ 7 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో గల డయాలసిస్ వార్డులో అదనంగా ఏర్పాటు చేసిన నాలుగు పరికరాలను సోమవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. డయాలసిస్ రోగులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డయాలసిస్ కేంద్రంలో 11 మిషన్లు ఉన్నాయని, మహారాష్ట్ర నుంచి వచ్చే రోగులతోపాటు పాము కాటు కేసులు వచ్చిన సమయంలో ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకుని మరో నాలుగు మిషన్లు ప్రభుత్వాన్ని కోరగా వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, ఆర్ఎంవో తొడసం చందు, జనరల్ మెడిసిన్ వైద్యులు కళ్లెం వెంకట్ రెడ్డి, ఆరోగ్య శ్రీ డీఎం సత్యనారాయణ, డయాలసిస్ ఇన్‌చార్జి ప్రేమ్‌దాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ పెద్దపెల్లి రమాదేవి, డయాలసిస్ కేంద్రం సిబ్బంది గణేశ్, దీక్ష, రాణి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్, సూపరింటెండెంట్